
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి
5
మెదక్
సోమవారం 25 నవంబరు 2024
జిల్లాల వార్తలు

సాఫ్ట్‌బాల్ టోర్నీ రన్నరప్ మెదక్
- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు
- ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: డీఈవో

7

రాజ్యాంగంపై కుట్రలను తిప్పికొట్టాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మా కులమేది..!
కుల ధ్రువీకరణకు నోచని పిట్టల కులస్థులు

- సర్టిఫికెట్ లేక ఉద్యోగాలు వచ్చినా.. నియామకాలు కాలే..
- కల్యాణలక్ష్మికీ అనర్హత
- స్కూల్‌లో, కుటుంబ సర్వేలో ఖాళీగా కాలం

వారు ఉంటున్న ఊరిని గుర్తించారు. కానీ, వారి కులం ఏమిటీ అన్నది మాత్రం అధికారికంగా ధ్రువీకరించలేదు. దీంతో ఆ కులస్థులు ప్రభుత్వ పథకాలకే కాదు.. ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినా సర్టిఫికెట్ లేకపోవడంతో విధుల్లో చేరే సమయంలో తిరస్కరణకు గురవుతున్నారు. అసలు చదువుకునే రోజుల నుంచే వారి సర్టిఫికెట్లల్లో కులం అనే కాలం ఖాళీగా వదిలేస్తుండగా.. ఇప్పుడు సమగ్ర సర్వేలోనూ ఆ కాలం ఖాళీగానే వదిలేస్తున్నారు. ఇది మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామపంచాయితీ పరిధి పిట్టలవాడ గ్రామానికి చెందిన పిట్లల కులస్థుల దుస్థితి.

7

ఇది ఆరంభం మాత్రమే..
- మలిదశలో పోరాటం మరింత ఉధృతం
- మాలలపై ద్వేషపూరిత వ్యాఖ్యలు తగదు
- వర్గీకరణతో మా ఉద్యోగాల్లో కోత
- దళితుల మధ్య చిచ్చు
- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ


పిల్లి సుధాకర్

రామాయంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి ఇది ఆరంభం మాత్రమే. భవిష్యత్తులో మలిదశ పోరాటం మరింత ఉధృతం చేస్తాం. ప్రభుత్వాలు స్పందించకపోతే మాలల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదు'... అని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన 'మాలల మహా పాదయాత్ర' ఆదివారం మెదక్ జిల్లా రామాయంపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా మాల మహానాడు తెలంగాణ అధ్యక్షుడు పిల్లి సుధాకర్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

వర్గీకరణ తీర్పుతో మాలలకు జరిగే నష్టం ఏమిటి.?

ప్రధానంగా మా ఉద్యోగాల్లో కోత పడుతుంది. ప్రభుత్వ పథకాల్లోనూ నష్టం జరుగుతుంది. జనాభా దామాషా ప్రకారం చూసినా మాలలు రాష్ట్రంలో 30 లక్షలు ఉన్నారు.

పాదయాత్ర ఎక్కడ మొదలైంది? ముగింపు సభ ఎక్కడ నిర్వహిస్తారు?

మహాపాదయాత్ర భద్రాచలంలో అక్టోబరు 25న మొదలైంది. 38 రోజులుగా 35 నియోజకవర్గాల మీదుగా 16 జిల్లాల్లో పాదయాత్ర న్విహిస్తున్నాం. డిసెంబరు 1న హైదరాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్‌కు చేరుకుంటుంది. అక్కడ లక్ష మందితో సభ నిర్వాహిస్తాం.

ఉత్తర తెలంగాణలో చేపట్టిన వర్గీకరణ వ్యతిరేకోద్యమానికి స్పందన ఎలా ఉంది?

వర్గీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన మహా పాదయాత్ర ఉద్యమానికి ఎంతో ఊపునిచ్చింది. ఏ ప్రాంతానికి వెళ్లినా మాలల నుంచి ఆదరణ అద్భుతంగా ఉన్నది.

చన్నీటి స్నానం..
చలితో సావాసం
హాస్టళ్లలో వణుకుతున్న విద్యార్థులు

- దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో చలికి తిప్పలు
- ఉదయాన్నే తప్పని చన్నీటి స్నానాలు
- మంచాలు లేక నేలపైనే చిన్నారుల నిద్ర
- పలు గురుకులాల్లో ఇవే సమస్యలు
- అధికారులు దృష్టిసారిస్తే విద్యార్థులకు ప్రయోజనం
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగులోకి..


చేగుంట బాలుర ఎస్సీ వసతిగృహంలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి పరిశీలన


హవేళీఘణపూర్ బీసీ గురుకుల బాలుర పాఠశాలలో పగిలిన కిటికీ అద్దాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, నవంబరు 24: గుమ్మడిదల, హవేలి ఘన్‌పూర్, మెదక్‌లో మాత్రమే కాదు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల వ్యాప్తంగా పలు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఇవే పరిస్థితులు దాపురించాయి. ఓ వైపు తీవ్రమైన చలి నెలకొన్నప్పటికీ అధికార యంత్రాంగం హాస్టళ్ల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదులు వస్తే తప్ప వారిలో చలనం ఉండడం లేదు. ప్రతీ ఏటా విద్యార్థులకు టంచన్‌గా రావాల్సిన దుప్పట్లు, రగ్గుల విషయంలోనూ జాప్యం జరుగుతోంది. ఇక మంచాలు లేక నేలపైనే నిద్రిస్తున్నారు.

ఎక్కడ చూసినా అదే దుస్థితి..

- కోహీర్ మండలం దిగ్వాల్‌లో ఎస్సీ గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. చాలామంది పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేయలేదు.
- వట్‌పల్లి మండలంలోని దేవునూర్‌లోని బాలుర వసతి గృహంలో సోలార్ వాటర్ హీటర్ చెడిపోవడంతో చన్నీటి స్నానాలు చేస్తున్నారు.
- కల్హేర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 128 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి గత ఏడాది పంపిణీ చేసిన

మిగతా 8వ పేజీలో..

'గుమ్మడిదల ఎస్సీ హాస్టల్‌లో 60 మంది విద్యార్థులు ఉన్నారు. గతేడాది పంపిణీ చేసిన ఉలెన్ బ్లాంకెట్లు కొందరి వద్దే ఉన్నాయి. అద్దె భవనంలో హాస్టల్ ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కిటికీలు, తలుపులు సరిగా లేవు. నేల మీదనే నిద్రిస్తున్నారు. చన్నీటి స్నానమే దిక్కవుతున్నది.'

'హవేళీఘణపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 410 మంది విద్యార్థులు ఉన్నారు. గదుల కొరతతో పగలు చదువు, రాత్రి నిద్ర ఒకే గదిలో కొనసాగుతోంది. కిటికీలు సరిగా లేక చలి వీస్తోంది. 4 గదులకు తలుపులు సక్రమంగా లేవు. ఉదయం చన్నీటితోనే పిల్లలు స్నానం చేస్తున్నారు.'

'మెదక్ సమీకృత బాలుర హాస్టల్‌లో ఇటీవలే కార్పెట్లు ఇచ్చారు. రగ్గులు ఇవ్వకపోవడంతో ఇంటివద్ద నుంచి తెచ్చుకున్నారు. తలుపులు, కిటికీలు దెబ్బతిన్నా బాగు చేయలేదు. కిటికీలకు అడ్డుగా బెడ్‌షీట్లు, టవళ్లు కట్టుకుంటున్నారు. అయినా చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.'

వరి కొయ్యలకు నిప్పు..
పర్యావరణానికి ముప్పు

- భూసారానికి నష్టం
- దిగుబడులు తగ్గే ప్రమాదం
- కలియదున్నితే ప్రయోజనం



మెదక్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లావ్యాప్తంగా వరికోతలు పూర్తయ్యాయి. రైతులు మరో పంటకు సిద్ధమవుతున్నారు. వరికోయగా మిగిలిన కొయ్యలను లేకుండా చేసేందుకు చాలామంది నిప్పు పెడుతున్నారు. రబీ, యాసంగి రెండు సీజన్లలో ఇలా చేస్తుండడంతో నేలలో పంట పోషకాలు, మిత్ర బ్యాక్టీరియా, మేలు చేసే పురుగులు అంతరించిపోతాయి. భూసారమూ తగ్గిపోయి పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. పంట వ్యర్థాలు తగులబెడుతుండడంతో వచ్చే పొగతో వాయుకాలుష్యం పెరుగుతోంది. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 3.70 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వివిధ రకాల పంటలను సాగుచేశారు. పంట చేతికందాక యాసంగి పంటల కోసం రైతులు వాటి అవశేషాలను దహనం చేస్తుండడంతో.. మరో పంటపై దాని ప్రభావం పడి దిగుబడులు తగ్గుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా రైతులు వరి కొయ్యలను కలియదున్నితో సేంద్రియ కర్బన శాతం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యామ్నాయాలపై రైతులకు అవగాహన

వరి, మొక్కజొన్న తదితర పంటల అవశేషాలను దహనం చేయడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నాం. పంట వరికొయ్యలు, పంట అవశేసాలను కాల్చడం వల్ల భూమిలోని నైట్రోజన్, పాస్పరస్, పొటాషియం వంటి పోషయాలు ఆవిరైపోతాయి. పంటల ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రైతులు పంట మిగులును దహనం చేయకండా ప్రకృతి పద్ధతులు అనుసరించాలి. పొలంలో కలియదున్నడం, బయోగ్యాస్ తయారీకి ఉపయోగించడం చేయవచ్చు.

– గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి, మెదక్


చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

బాలుడి కిడ్నాప్ కథ
సుఖాంతం
- అక్క కోసం పసికందు కిడ్నాప్..
- అనంతపూర్ నుంచి వచ్చి నిలోఫర్ వద్ద ఎత్తుకెళ్లిన వైనం
- కర్నూల్ హైవేపై ముగ్గురు నిందితుల అరెస్ట్
- చిన్నారిని తల్లికి అప్పగించిన అధికారులు

7

కబ్జాపై కదిలిన కాలనీవాసులు
రహదారి స్థలం అన్యాక్రాంతం కాకుండా అడ్డుకుని హద్దుల ఏర్పాటు


రహదారి స్థలం హద్దులు తెలిసేలా కాల్వ తీయిస్తున్న కాలనీవాసులు

సంగారెడ్డి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఓ ప్రభుత్వ అధికారి రహదారి స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించగా కాలనీవాసులు అడ్డుకున్నారు. పట్టణంలోని తెలంగాణ టౌన్‌షిప్ పక్కన ఉన్న రాఘవేంద్రనగర్ కాలనీకి వెళ్లే 40 ఫీట్ల రోడ్డు ఇరువైపులా ఓ అధికారి ఆక్రమించారు. 65వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న రాఘవేంద్రనగర్ కాలనీలో ఆయన ప్లాట్‌ను కొనుగోలు చేశారు. ఆ స్థలం పక్క నుంచి ఉన్న రహదారి స్థలాన్ని కబ్జా చేసి షెడ్డు నిర్మించారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని, దీంతో రెచ్చిపోయిన అధికారి తన పలుకుబడిని ఉపయోగించి రహదారిపైనే విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించారని కాలనీవాసులు తెలిపారు. దీంతో, ఆగ్రహించిన కాలనీవాసులు ఆదివారం ఎక్సవేటర్‌ను తీసుకువచ్చి సదరు అధికారికి చెందిన ప్లాట్ హద్దులు తెలిసేలా కాల్వను తవ్వించి, కబ్జాకు గురైన రహదారి స్థలాన్ని కాపాడారు. రిపై ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ట్రాన్స్‌కో ఎస్ఈకి ఫిర్యాదు చేస్తామని కాలనీ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శశాంక్, బాలయ్య తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ కీలకం
- డోర్ లాక్, వలస వెళ్లిన వారి వివరాలు సేకరించండి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన డిప్యూటీ సీఎం


వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ అత్యంత కీలకమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కలెక్టర్లతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డేటా ఎంట్రీలో పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకూడదన్నారు. డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేని, వలస వెళ్లినవారి వివరాలను సేకరించాలని సూచించారు. అనంతరం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వే వేగవంతం చేశామని, వలస కుటుంబాలు, డోర్ లాక్ కుటుంబసభ్యులను గ్రామాలకు పిలిపించి వివరాలు సేకరిస్తున్నామని వివరించారు. వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్డీవోలు, ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో పాటు జిల్లా ఉన్నతాధికారులు పర్యటిస్తూ, పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.


ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గామాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా దీపాలు వెలిగించారు.

–పాపన్నపేట, (ఆంధ్రజ్యోతి)

పెళ్లయిన రెండు వారాలకే నవ వరుడి ఆత్మహత్య


నర్సింహ(ఫైల్)

రామచంద్రాపురం, నవంబరు 24: పెళ్లి జరిగిన 13 రోజులకే నవవరుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నది. సీఐ జగన్నాథ్ వివరాల ప్రకారం... గొట్టిముక్కల నర్సింహ(36) బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో నివాసముంటున్నాడు. రామచంద్రాపురంలో ఓ షెట్టర్ అద్దెకు తీసుకుని వెల్డింగ్ దుకాణం నడుపుతున్నాడు. ఈ నెల 10న మహారాష్ట్ర షోలాపూర్‌కు చెందిన జయశ్రీతో వివాహం జరిగింది. పెళ్లి నాటి నుంచి దంపతుల మధ్య సంసార విషయంలో గొడవలు జరుగుతున్నాయి. జయశ్రీ 'తాను తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్తాను' అంటూ గొడవపడుతూ వస్తుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నర్సింహ ఈ నెల 22న భార్యను వారి తల్లిదండ్రుల ఇంటి వద్ద దింపివచ్చాడు. గొడవ పడి భార్య పుట్టింట్లో ఉండిపోవడాన్ని జీర్ణించుకోలేక నర్సింహ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం ఉదయం షాపులో పని ఉందని తల్లికి చెప్పి దుకాణానికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి కొడుకు ఇంటికి రాకపోవడంతో తల్లి ఫోన్‌చేసింది. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో చిన్న కుమారుడిని దుకాణానికి పంపింది. దుకాణంలో వైర్లతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్న నర్సింహను గుర్తించిన తమ్ముడు చుట్టుపక్కల వారి సహాయంతో మృతదేహాన్ని కిందికి దింపాడు. వెంటనే 108 సిబ్బందికి సమాచారమందించగా వచ్చి నర్సింహ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

మా కులమేది..!

● కుల ధ్రువీకరణకు నోచని పిట్టల కులస్థులు
● సర్టిఫికెట్ లేక ఉద్యోగాలు వచ్చినా.. నియామకాలు కాలే..
● కల్యాణలక్ష్మికి అనర్హత
● స్కూల్‌లో, కుటుంబ సర్వేలో ఖాళీగా కాలం

రిజిస్టర్‌లో ఖాళీగా ఉంచుతున్నాం



మా స్కూల్‌లో చదువుకుంటున్న పిట్టల కులస్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలేదు. దీంతో అడ్మిషన్ రిజిస్టర్‌లో ఆ కాలం ఖాళీగా ఉంచుతున్నాం.

- జయప్రకాశ్, హెచ్ఎం, పిట్టలవాడ పాఠశాల

సర్వేలో కులం పేరు రాయలేదు..



సమగ్ర కుటుంబ సర్వేలో ఈ గ్రామస్థుల సరైన కులం లేనందున కాలం ఖాళీగా వదిలి వేశాం. ఇక్కడి వారు మాత్రం తాము నక్కల-32 (ఎస్టీ) కులస్థులుగా చెబుతున్నారు. సర్వే జాబితాలో, ఫారాల్లో పిట్టల కులం గురించి లేదు. దీంతో ఖాళీగా వదిలేశాను.

-అన్వర్ జహాన్, పిట్టలవాడలో సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్


ఇంటర్ చదివి ఇంటివద్దనే ఉంటున్నా..



ఇంటర్మీడియట్ చదువుకున్నాను. కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో పైచదువులకు వెళ్లలేకపోయా. నాతో పాటు చాలా మంది చదువులకు, ఉద్యోగాలకు దూరంగా ఉన్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

- పిట్టల గంగ, పిట్టలవాడ

తూప్రాన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామపంచాయితీ పరిధి పిట్టలవాడ గ్రామానికి చెందిన పిట్టలవారు ఉంటున్న ఊరిని గుర్తించారు. కానీ, వారిది ఏ కులమనేది మాత్రం ఇప్పటికీ ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించలేదు. దీంతో ఆ కులస్థులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు అంతేకాదు.. ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినా కుల సర్టిఫికెట్ లేక నియామకం సమయంలో వీరిని అధికారులు తిరస్కరిస్తున్నారు. మొదటి నుంచే పిట్టలవారి విద్య సర్టిఫికెట్లలో కులం అనే కాలం ఖాళీగా వదిలేస్తుండగా.. ఇప్పుడు సమగ్ర సర్వేలోనూ ఆ కాలం ఖాళీగానే వదిలేస్తుండడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల రిజిస్టర్‌లో ఖాళీగా ఉన్న కులం కాలం

46 కుటుంబాలు..

దశాబ్దాల క్రితం పిట్టల కులస్థులంతా ఒకే చోట నివసిస్తుండటందో ప్రభుత్వం ఆ గ్రామాన్ని పిట్టల వాడగా గుర్తింపు ఇచ్చింది. అప్పట్లో పెద్ద ఎత్తున నివాసం ఉండగా.. చాలా మంది ఉపాధి కోసం వలస వెళ్లడంతో ప్రస్తుతం ఆ గ్రామంలో 46 కుటుంబాలు.. సుమారు 150 మంది జనాభా ఉన్నారు. అటవీ ప్రాంతంలో నివసించే వీరి భాష లంబాడీ భాషకు దగ్గరగా ఉంటుంది. జంతువులను వేటాడి జీవనోపాధి పొందేవారు. అయితే, వేట నిషేధం కావడం.. కొందరిపై కేసులు నమోదు కావడంతో ఆ వృత్తిని వదిలి ఆ ఊరి వారంతా ఇప్పుడు రోడ్ల పక్కన పండ్లు, మొక్కజొన్న కంకులు, కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. అంతా బాగానే ఉన్నప్పటికీ తాము పిట్టల కులస్థులుగా చెప్పుకుంటున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వారిని అధికారికంగా పిట్టల కులస్థులుగా గుర్తించలేదు. ఈ మేరకు వారికి ధ్రువీకరణ పత్రాలూ జారీ చేయడం లేదు.

ఉద్యోగాలకూ దూరం..

కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో వారి పిల్లలు చదువులకు, ఉద్యోగాలకు దూరం అవుతున్నారు. పిట్టలవాడలో ప్రభుత్వ పాఠశాల ఉండటంతో ఇక్కడ చదివే విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో అడ్మిషన్ రిజిస్టర్‌లో కులం రాయాల్సిన కాలం ఖాళీగా వదిలేస్తున్నారు. గ్రామానికి చెందిన శివ, అమరావతి, విజయ్, సుబ్బలక్ష్మిలు ఎస్టీలు పేర్కొంటూ దరఖాస్తులు చేసుకుని, పోలీసు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. నియామకం సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లలో కుల ధ్రువీకరణ లేకపోవడంతో వీరి నియామకాలు రద్దయ్యాయి. ఇందులో సుబ్బలక్ష్మి నెల రోజుల పాటు పోలీస్ శిక్షణ పూర్తి చేసినప్పటికీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో వెనక్కి వచ్చినట్లు గ్రామస్థులు చెప్పారు. పలువురు ప్రాథమిక విద్యను అభ్యసించి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ లేకపోవడంతో అక్కడితో చదువు ఆపేయాల్సి వచ్చింది. ఇక ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా వారికి అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుల గణన కోసం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో సైతం పిట్టల కులస్థులకు న్యాయం జరగలేదు. సర్వే పత్రాల్లో పిట్టల కులస్థుల కాలం లేదని ఎన్యుమరేటర్లు వివరించారు. దీంతో ఈ కాలంలో ఖాళీగా వదిలివేశారు.

అధికారుల వద్దకు ముప్పయి సార్లు వెళ్లాను



పిట్టల కులస్థులకు కుల ధృవీకరణ పత్రాల కోసం అధికారుల వద్ద 30 సార్లు వెళ్లాను. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారులను కలిశాను. ఎంత మంది అధికారులను కలిసిన కులం నిర్ధారణ చేయడంలేదు. పక్కనే ఉన్న సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలలో ఎస్టీలుగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ఇక్కడే పట్టించుకోవడంలేదు.

- పంజా బిక్షపతి, దండుపల్లి

అధికారులకు నివేదిక పంపారు



పిట్టలవాడకు చెందిన పిట్టల కులస్థులకు గతం నుంచే కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలేదు. వాళ్ల విజ్ఞాపనతో విచారణ చేసి గతంలో నివేదికను కలెక్టర్‌కు పంపారు. కలెక్టర్ నుంచి నివేదికను ప్రభుత్వానికి నివేదించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తాం. అధికారుల నుంచి ఆదేశాలు జారీ చేయకపోవడంతో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదు.

-చంద్రశేఖర్‌రెడ్డి, మనోహరాబాద్ తహసీల్దార్



అంతారం గ్రామంలోని విఠలేశ్వర ఆలయం

నేటి నుంచి అంతారం జాతర

● ముస్తాబైన పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయం

మునిపల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అంతారం గ్రామంలో శ్రీశ్రీశ్రీ జీవన్ముక్త మహారాజ్ జాతరకు వేళ అయ్యింది. ఈ నెల 25 నుంచి 29 వరకు జరిగే ఈ ఉత్సవాలకు పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. అందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ పీఠాధిపతి జ్ఞానేశ్వర (బాల్‌రాజ్) మహారాజ్ తెలిపారు. 25న శిఖరస్థాపన, 26న గురడవాహనము, 27న మహాపూజ, 28న గోపాళ్‌కాల, 29న రథోత్సవం తదితర పజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. విద్యుత్ కాంతులతో ఆలయం కాంతులు విరజిమ్ముతుండడంతో రథోత్సవానికి రథాన్ని సిద్ధంగా ఉంచారు.

ఆలయ ప్రత్యేకత..



పాండు రంగా విఠలేశ్వర స్వామి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. అందోల్ నియోజకవర్గంలో ఓ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం షురూ చేసే ముందు స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించడం ఆనవాయితీ. అయితే బరిలో నిలిచి గెలుపొందిన ఏ ఎమ్మెల్యే అయినా ఈ దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ అంతారం గ్రామాన్ని దేవుడి అంతారంగా కూడా అని పిలుస్తారు. ఈ ఆలయానికి వచ్చేందుకు సదాశివపేట నుంచి బుదేరా, కంకోల్ గ్రామం మీదుగా అంతారం గ్రామానికి చేరుకోవచ్చు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కలదు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ పీఠాధిపతి జ్ఞానేశ్వర్ (బాల్‌రాజ్) మహారాజ్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలనిఆయన కోరారు.

వైభవంగా సుదర్శన నారసింహ యాగం



యాగం నిర్వహిస్తున్న పురోహితులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం దేవాలయంలో మహా మండలార్చన ప్రయుక్త సుదర్శన నారసింహ యాగాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన యాగం సాయంత్రం 4 గంటల వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు సమక్షంలో వైభవంగా యాగాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర సతీమణి పద్మిణిరెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి విచ్చేసి యాగాన్ని వీక్షించారు. సుమారు 400 మంది భక్తుల జంటలు యాగంలో పాల్గొన్నాయి.

కూలిన ఇంటి పైకప్పు

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



కూలిన ఇంటి కప్పు

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా ఇంటి పైకప్పు కూలింది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బక్కయల మహిపాల్ దంపతులు శనివారం ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి 1 గంటల సమయంలో అకస్మాత్తుగా ఇంటి పైకప్పు గోడ కూలి వారిపై పడింది. చుట్టుపక్కవారు నిద్రలేచి.. వారిని కాపాడారు. దాదాపు 15 నిమిషాల పాటు దంపతులిద్దరూ మట్టిలో కూరుకుపోయారు. భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సమయంలో పిల్లలు వేర్వేరు గదుల్లో పడుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సాఫ్ట్‌బాల్ టోర్నీ రన్నరప్ మెదక్

● ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు
● విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : డీఈవో

మాసాయిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని డీఈవో రాధాకిషన్‌రావు అన్నారు. మాసాయిపేట మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక వికాసం సిద్ధిస్తుందని అన్నారు. ఉన్నత లక్ష్యాలను చేరేందుకు క్రీడలను మెట్లుగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అనంతరం సాఫ్ట్ బాల్ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. నిజామాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలువగా, మెదక్ రెండవ, మంచిర్యాల మూడవ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నుంచి శోభన్ బాబు, రేణుక, అభిషేక్ గౌడ్, క్రీడా కార్యదర్శి రమేశ్, ఉపాధ్యాయులు, ధర్మపురి, రంగారెడ్డి, హరిరంజన్ శర్మ, శ్యాం సుందర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



గెలిచిన జట్లకు బహుమతుల ప్రదానం

రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మెదక్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం ద్వారానే బానిస బతుకులకు విముక్తి కలిగిందని, ప్రస్తుతం ఆ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రతికూల శక్తులు కుట్రలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో 75 ఏళ్ల భారత రాజ్యాంగ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. కుల వివక్ష, నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు వేయడం రాజ్యాంగం ద్వారానే సాధ్యమైందన్నారు. దేశానికి రెండవ రాజ్యాంగం ఉండాలని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ముందు చూపుతో ఆనాడే ప్రతిపాదించారని గుర్తు చేశారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని భారత రాజ్యాంగం దేశ పౌరులకు అందించిందన్నారు. కోట్లాది మంది అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవాలను పండగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా సమాజంలో నేటికీ కుల వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ నియామకాల్లో మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్నాయని, రాజకీయాల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎకరా స్థలం కేటాయించాలని చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా సంఘనేత జెల్లా సుధాకర్, సీనియర్ జర్నలిస్టు బొందుగుల నాగరాజు, జిల్లా కార్యదర్శి దయాసాగర్, అహ్మద్, బ్యాగరి వేణు, శ్రీనివాస్, న్యాయవాది సిద్దిరాములు, నర్సింగ్‌రావు, రాధాకిషన్, దుబాషి సంజీవ్, బాబు, నాయక్, మందుగుల గంగాధర్, బాల్‌రాజ్ గౌడ్, వెంకన్న, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● పలు ట్రాన్స్‌ఫార్మర్లలో కాయిల్స్, ఆయిల్ చోరీ
● నిందితులపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు
● వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

రాయపోల్/గజ్వేల్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్, ఆయిల్ దొంగతనం చేస్తున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను రాయపోల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆదివారం రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి వివరాలను వెల్లడించారు. రామారం గ్రామ శివారులో ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు కారులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరాలు బయటపడ్డాయి. హర్యానా రాష్ట్రానికి చెందిన జుబేర్‌ఖాన్, అర్షద్, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఫజర్, జాహిద్‌లు ఎక్స్‌కవేటర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరు దూరంగా వ్యవసాయ పొలాలు, రోడ్డు పక్కన ఉండే ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. వాటి నుంచి కాయిల్స్ ఆయిల్ చోరీ చేస్తున్నారు. నిందితులపై జిల్లావ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేయడానికి గడ్డపార, పాణాలు వారి కారులో లభించాయి. అయితే ఈనలుగురు నిందితులపై గతంలో చేగుంట మండలం మైసపేట గ్రామ శివారులో ఉన్న చైతన్య ఇండస్ట్రీస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ దొంగతనం చేసిన కేసులో పోలీసులు అక్టోబరు 3న అరెస్టు చేసి జైలుకు పంపించగా అదేనెల 11న విడుదలయ్యారు. అప్పటి నుంచి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నారు. ఆయిల్, కాయిల్స్‌ను తూప్రాన్ పట్టణంలోని ఆదేశ్ అనే వ్యక్తికి అమ్ముతున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి ఒక కారు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులకు అభినందించారు. కార్యక్రమంలో తొగుట సీఐ షేక్ లతీఫ్ రాయపోల్ ఎస్సై రఘుపతి, బేగంపేట ఏఎస్ఐ అమృత్, పోలీస్ సిబ్బంది మధుసూదన్ రెడ్డి, స్వామి, సత్యనారాయణ, సోమయ్య, కనకరాజు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

క్రైం కార్నర్

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



నితిన్ (ఫైల్)

హత్నూర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన హత్నూర మండల పరిధిలోని మంగాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండలం మాడాపూర్ గ్రామానికి చెందిన బేగరి నితిన్ (19) ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై దౌల్తాబాద్ నుంచి స్వగ్రామమైన మాడాపూర్‌కు వెళ్తుండగా.. మంగాపూర్ గ్రామ శివారులోకి చేరుకోగానే లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి..



గంగాధర్ మృతదేహం

తూప్రాన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన చెప్పుల వ్యాపారి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన మోచి గంగాధర్ (52) చెప్పులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం వెల్దుర్తి వారాంతపు సంతలో చెప్పులు విక్రయించి రాత్రి ఇంటికి ఆటోలో వెళ్తున్నాడు. తూప్రాన్ పట్టణ శివారులోని నాగులపల్లి హైవే బ్రిడ్జి వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆటో రాయిపైకి ఎక్కడంతో ఆటోలో ఉన్న గంగాధర్ కిందపడగా.. అతడిపై నుంచి ఆటో వెళ్లింది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుమారుడు ప్రేమ్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి ఆత్మహత్య

దౌల్తాబాద్,నవంబర్24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి కిషన్ ఆర్ఎంపీ వైద్యుడిగా పని చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఆయన భార్య మృతిచెందడంతో నిర్మల్ జిల్లాకు చెందిన ప్రవీణను వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులుగా డబ్బుల తేవాలని ఆమెను భర్త కిషన్ వేధింపులకు గురిచేస్తున్నాడు. మొదటి భార్య కొడుకు శ్రీనివాస్ అతని భార్య కారణంగా రోజూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ప్రవీణ ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తుండగా, మృతురాలి బంధువులు వచ్చే వరకు తీసుకెళ్లొదని స్థానికులు అడ్డుకున్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

● అక్క కోసం పసికందు కిడ్నాప్..
● అనంతపూర్ నుంచి వచ్చి నిలోఫర్ వద్ద ఎత్తుకెళ్లిన వైనం
● కర్నూల్ హైవేపై ముగ్గురు నిందితుల అరెస్ట్
● చిన్నారిని తల్లికి అప్పగించిన అధికారులు

మంగళ్‌హాట్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): నిలోఫర్ ఆస్పత్రి వద్ద కిడ్నాప్‌నకు గురైన పసికందు కథ సుఖాంతమైంది. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులను దాటించక ముందే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన హసీనాబేగం, గఫార్ దంపతులకు 45రోజుల బాబు ఉన్నాడు. కామెర్లు రావడంతో చిన్నారిని నిలోఫర్‌లో అడ్మిట్ చేశారు. ఆరోగ్యం కుదుటపడడంతో శనివారం వైద్యులు డిశ్చార్జ్ చేశారు. శనివారం సాయంత్రం నిలోఫర్ నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ఓ గుర్తుతెలియని మహిళ వద్దకు వచ్చి తాను ఈ ఆస్పత్రిలోనే పనిచేస్తానని పరిచయం చేసుకుంది. ఇంతలో సంతకం చేయాలని హసీనాను ఆమె తల్లి పిలవడంతో అక్కడున్న మహిళ నీవు సంతకం పెట్టి రా.. మీ బాబును నేను చూసుకుంటానని చెప్పింది. చిన్నారి తల్లి తిరిగి వచ్చేలోపు ఆ మహిళ కనిపించకపోవడంతో నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల నిందితులు కర్నూల్ జిల్లా వైపు వెళ్తున్నట్లు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు ఎస్ఐలు నాగరాజు(అలంపూర్ పీఎస్), చంద్రకాంత్(మానవపాడ్ పీఎస్), మహేష్‌గౌడ్ (ఉండవల్లి పీఎస్) తమ సిబ్బందితో కలిసి అదేరోజు రాత్రి 10.30 గంటల సమయంలో పుల్లూర్ టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఏపీ 28 ఏవీ 0785 నంబర్ గల ఓమ్నీ వ్యాన్ అటుగా రాగా అందులో ముగ్గురు చిన్నారులతోపాటు బురఖా ధరించిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి ఉన్నట్లు గుర్తించి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. నిలోఫర్ వద్ద కిడ్నాప్‌కు సంబంధించిన ఫొటోలతో సరిచూడగా నిందితులతో పాటు కిడ్నాప్‌నకు గురైన బాబు అందులోనే ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.





నిందితులు షహీనా బేగం, అబ్దుల్లా

అక్క కోసం కిడ్నాప్...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ మేకల చెరువు ప్రాంతానికి చెందిన అబ్దుల్లా అలియాస్ వెంకటేష్, రేష్మా అలియాస్ రేణుక దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. ప్రస్తుతం గర్భవతి అయిన రేణుక మళ్లీ ఆడపిల్లే పుడుతుందేమోనని ఆందోళన చెందేది. అయితే, రేణుక చెల్లి షహీన్ బేగం(28) అక్క కోరిక మేరకు ఓ బాబును ఎత్తుకొచ్చేందుకు సహకరిస్తానని ఒప్పుకుంది. పథకం ప్రకారం నిలోఫర్ ఆస్పత్రి వద్దకు షహీన్ బేగం తన బావ అబ్దుల్లా అలియాస్ వెంకటేష్‌తో చేరుకుంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన హసినాబేగం దృష్టి మరల్చి పసికందుతో ఆటోలో అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం కొద్దిదూరం వెళ్లి తర్వాత ద్విచక్ర వాహనంపై జారుకున్నారు. వీరు కర్నూలు చేరుకునే లోపే నగర పోలీసులు అలంపూర్, మానవపాడ్, ఉండవల్లి పోలీసులను అప్రమత్తం చేశారు. ఓమ్నీ వ్యానులో వస్తున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని నాంపల్లి పోలీసులకు అప్పగించారు. ఓమ్నీ వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు నిందితులు షహీన్ బేగం, అబ్దుల్లా, రేష్మా అలియాస్ రేణుకలను అరెస్ట్ చేసినట్లు సైఫాబాద్ ఏసీపీ తెలిపారు. బాబును సురక్షితంగా తల్లికి అప్పగించినట్లు తెలిపారు.

బస్‌షెల్టర్లు లేక ఇక్కట్లు

- జహీరాబాద్ నియోజకవర్గంలో అవసరమైన చోట కనిపించవు.. ఉన్నవాటికి మరమ్మతులు కరువు
- ఎండ, వాన నుంచి రక్షణ కరువు
- పట్టించుకోని యంత్రాంగం



రాయిపల్లి తండా చౌరస్తా వద్ద శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్

జహీరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగ ప్రధాన, అంతర్గత కూడళ్ల వద్ద బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఉన్న బస్‌షెల్టర్లకు సైతం కనీస మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రధాన కూడళ్లలో కొద్దిపాటి వర్షపు జల్లులువచ్చినా, ఎండ నుంచి కాస్త ఉపశమనం పొందాలన్నా బస్‌షెల్టర్లు లేని కారణంగా ప్రయాణికులకు నిత్యం అవస్థలు తప్పడంలేదు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. కనీసం ప్రధాన చౌరస్తాల్లోనైనా బస్‌షెల్టర్లు ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవసరమైన ప్రాంతాలు ఇవే..

నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తూర్(డి), దిగ్వాల్, రాయిపల్లి(డి),మదిరి, హుగ్గెల్లి, రంజోల్, బూడ్డిపాడ్ చౌరస్తా, బూచనెల్లి చౌరస్తా, సత్వార్, మాడ్గిచౌరస్తా, ధనసిరి, మొగుడంపల్లి, మన్నాపూర్, గుడిపల్లి, గౌసాబాద్, మోతిమాతఆలయం వద్ద, పర్వతాపూర్ చౌరస్తా, గోవిందాపూర్, అల్గోల్ చౌరస్తా, మాచ్నూర్, బీదర్-అల్లాన చౌరస్తా, దిడిగి, కొత్తూర్(బి), కొత్తూర్-ఖానాపూర్ చౌరస్తా, బడంపేట, మనియార్‌పల్లి, కప్పాడ్ చౌరస్తా, పస్తాపూర్, గంగ్వార్, హద్నూర్, ముంగి చౌరస్తా, ఇబ్రహీంపూర్ చౌరస్తా, రాఘవపూర్-హరామ్నాపూర్ చౌరస్తా, గొడిగార్‌పల్లి, చిరాగ్‌పల్లి, మాడ్గి ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా చాలాచోట్ల బస్‌షెల్టర్ల నిర్మాణం చేయించాల్సిన అవసరం ఎంతో ఉంది.

పలుచోట్ల మరమ్మతులు లేక..

రాయిపల్లి తండా చౌరస్తా, హోతి(కే), చిన్నహైదరాబాద్, హోతి(బి)క్రిష్ణాపూర్, సిద్దివినాయక టెంపుల్, తదితర ప్రాంతాల్లో ఎప్పుడో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లకు మరమ్మతులు కరువయ్యాయి. ఆ బస్ షెల్టర్లలో కనీసం కూర్చునేందుకు కూడా వీలులేని పరిస్థితి. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టి, లేనిచోట ప్రయాణికుల అవసరాలను బట్టి బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



హోతి(కే) చౌరస్తా వద్ద కనీసం కూర్చునే వీలులేక నిలబడి ఉన్న ప్రయాణికులు

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగింది. మెదక్ జిల్లాలో 5, సంగారెడ్డి జిల్లాలో 7 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించిన పరీక్షకు మెదక్ జిల్లావ్యాప్తంగా మొత్తం 1,008 మంది విద్యార్థులకు గానూ..979(97.12 శాతం) హాజరైనట్టు మెదక్ డీఈవో రాధాకిషన్ తెలిపారు. సంగారెడ్డిలో 1,123 మందికి గానూ 1,028 మంది హాజరు కాగా 91.54 హాజరు శాతం నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కరుణ హైస్కూల్‌లోని రెండు కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పండరినాయక్ పరిశీలించారు.

బజరంగ్ దళ్ సంయోజక్‌గా వినోద్‌కుమార్

పుల్‌కల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం బజరంగ్ దళ్ సంయోజక్‌గా కోర్పోలు గ్రామానికి చెందిన చల్లా వినోద్ కుమార్ ఎన్నికయ్యారు. మండల కేంద్రం చౌటకూర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశానంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సహ సంయోజక్‌గా వెంకటకిష్టాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్, మండల గోరక్ష ప్రముఖ్‌గా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. కోర్పోలు గ్రామ ప్రముఖ్‌గా మన్నె మల్లేశం, సహ ప్రముఖ్‌గా జిల్లా మహేందర్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా సంయోజక్ ప్రభుకుమార్‌గౌడ్ వెల్లడించారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకారం

మనోహరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్లకల్ గ్రామంలో వెలసిన శ్రీకాలకంఠేశ్వరస్వామివారి పురాతన ఆలయ పునర్నిర్మాణానికి గ్రామవాసి వర్గంటి దశరథరెడ్డి ముందుకొచ్చారు. పునర్నిర్మాణ పనులకు ఎంత ఖర్చయినా భరిస్తానని గ్రామంలోని పెద్ద మనుషుల సమక్షంలో ఆదివారం దశరథరెడ్డి ఒప్పందపత్రం రాసి ఇచ్చారు.

'మెట్రో'ను ఇస్నాపూర్ వరకు పొడిగించాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

పటాన్‌చెరు, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణం వరకు విస్తరిస్తున్న మెట్రోరైలు ప్రాజెక్టును ఇస్నాపూర్ వరకు పొడిగిస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయని, అందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మెట్రో సాధన సమితి సభ్యులు వినతిపత్రాలు సమర్పించారు. మెట్రో సాధన సమితి కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ నేతృత్వంలో వినతిపత్రాలను అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పటాన్‌చెరు వరకు మెట్రో సాధన కోసం చేసిన కృషి ఫలించిందని, జనావాసాలు ఎక్కువగా ఉండే ఇస్నాపూర్ వరకు పొడిగిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా కార్మికులతో పాటు సంగారెడ్డి జిల్లా ప్రజలు హైదరాబాద్ వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. తమ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు సానుకూలంగా స్పందించారని, ఈ ప్రతిపాదనపై ప్రభుత్వంతో చర్చించి సానుకూలమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు చెప్పారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మెట్రో సాధన సమితి సభ్యులు రుద్రారం శంకర్, అబ్దుల్‌బాసిత్, ఈర్ల రాజు, మెట్టుశ్రీధర్, పన్యాలశ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

గుండ్రెడ్డిపల్లి అడవిలో పులి సంచారం

తూప్రాన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రెడ్డిపల్లి శివారులోని ఆడవిలో పులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. గత మూడు రోజులుగా అటవీ ప్రాంతానికి సమీపంలో వ్యవసాయ భూములున్న రైతులు పులి సంచరిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఆదివారం సాయంత్రం పెద్ద గుట్ట వద్ద గుండుపై నుంచి దిగుతున్న పులిని గుండ్రెడ్డిపల్లికి చెందిన ఎస్‌కే సద్దాం చూసినట్లు చెబుతున్నారు. పులి పెద్దగుట్ట గుండుపై నుంచి దిగుతుండగా వీడియో తీసి గ్రామంలోని సోషల్ మీడియా గ్రూపుల్లో వేయడంతో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై అటవీ అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా స్పందించలేదు.

రైతు కూలీ సంఘం మహాసభల కరపత్రం విడుదల

మెదక్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) రెవెన్యూ సంస్కరణలను భూసంస్కరణలతో జోడించి అమలు చేయాలని రైతు కూలీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. డిసెంబరు 9న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ఆదివారం మెదక్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ స్వామి, మేకల రాములు, అంబాటి రమేష్, శ్రీనివాస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పనితీరుపై ట్రైనీ ఐఏఎస్‌ల ఆరా



మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన వివిధ రాష్ట్రాల ట్రైనీ అధికారులు

కొండాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లేపల్లిలో రాజస్థాన్, బీహార్, తమిళనాడు, ఉత్తరాంచల్ తదితర రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం వారం రోజుల పాటు పర్యటించనున్నది. గ్రామస్థాయి వనరులు, ఆదాయం, సామాజిక రాజకీయ విశ్లేషణ, నిరుపేద కుటుంబాల స్థితిగతులు, భూమి పంటల వివరాలు తెలుసుకోనున్నారు. ఈ మేరకు ఆదివారం మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘం ద్వారా సభ్యులకు కలిగే ప్రయోజనాలు, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ బాలికల హాస్టల్‌కు వెళ్లి భవిష్యత్ ప్రణాళికల సంసిద్ధతపై విద్యార్థులతో ముచ్చటించారు. పర్యటనలో ట్రైనీ కలెక్టర్‌లు అంకుశ్ మంగళ్, దీక్ష, మేఘన, సచిన్‌చూబే, జీపీ కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది కృష్ణ, భాస్కర్, పాండు, ప్రవీణ్ హాస్టల్ వార్డెన్‌లు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి



సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో కొత్త ఓటర్లకు దరఖాస్తులు అందజేస్తున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్/కంది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంతో పాటు కంది మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు వచ్చిన యువకులకు దరఖాస్తులు అందజేశారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని బీఎల్‌వోలకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో వెంట సంగారెడ్డి, కంది మండలాల తహసీల్దార్లు దేవదాస్, విజయలక్ష్మి, బూత్‌లెవల్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తప్పుల్లేకుండా డేటా ఎంట్రీ చేయాలి

తూప్రాన్/మనోహరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే డేటాను తప్పుల్లేకుండా ఎంట్రీ చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో డేటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. అదేవిధంగా మనోహరాబాద్ మండలంలోని దండుపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

చన్నీటి స్నానం.. చలితో సావాసం

(5వ పేజీ తరువాయి)

దుప్పట్లే ఉన్నాయి.

- కంగ్టి మండలం తడ్కల్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో కొత్తగా దుప్పట్లు ,స్వెటర్లు పంపిణీ చేయలేదు.
- సదాశివపేట మైనార్టీ గురుకులంలో పిల్లలు తమ ఇళ్ల వద్ద నుండి తెచ్చుకున్న దుప్పట్లనే వినియోగిస్తున్నారు.
- జోగిపేటలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు రగ్గులు, స్వెటర్లు ఇచ్చారు. బీసీహాస్టల్ వారికి మాత్రం అందలేదు.
- జహీరాబాద్‌లోని ఎస్టీ బాలుర హాస్టల్ భవనం బాగానే ఉన్నా కిటికీలు మరమ్మతులకు నోచుకున్నాయి. ఏ హాస్టల్‌లోనూ స్వెటర్లు పంపిణీ చేయలేదు.
- చేగుంట బాలుర ఎస్సీ హాస్టల్‌లో కొంతమందికి మాత్రమే బ్లాంకెట్లు అందజేశారు. కొన్ని గదులకు కిటికీ తలుపులు పట్టడం లేదు.
- చిన్నశంకరంపేట ఎస్సీ హాస్టల్‌లో 79 మంది విద్యార్థులు ఉన్నారు. అతి త్వరలోనే విద్యార్థులకు స్వెటర్లు, మంకీ క్యాంపులు ఇవ్వనున్నట్లు వార్డెన్ తులసీరామ్ తెలిపారు.
- వెల్దుర్తి బాలుర హాస్టల్‌లో చన్నీటి స్నానాలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తమ బాధలు చెప్పుకున్నారు.
- రామాయంపేట సమీకృత బాలుర వసతి గృహంలో అందరికీ దుప్పట్లు ఇచ్చారు. కానీ చలికాలంలో ఇవ్వాల్సిన బ్లాంకెట్లను పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థులు చలికి వణుకుతున్నారు.
- పాపన్నపేట మండలం కొత్తపల్లి బీసీ హాస్టల్‌లో చలి తీవ్రతకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చన్నీటికి బదులు స్నానానికి వేడినీళ్లు అందించాలని కోరుతున్నారు.

దృష్టిపెట్టాల్సిన సమయం

ప్రధానంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వంతోపాటు అధికార యంత్రాంగం దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హాస్టళ్లలో సరైన వసతులు లేకపోవడం వల్ల ప్రతీ ఏడాది చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దుప్పట్లు, బ్లాంకెట్లు కొన్నిచోట్ల పంపిణీ చేశారని, ఇంకొన్ని హాస్టళ్లలో ఇవ్వలేదన్నట్లుగా పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. చాలా హాస్టళ్లలో గత ఏడాది ఇచ్చిన దుప్పట్లు, స్వెటర్లనే వినియోగిస్తున్నారు. చలి తీవ్రత పెరగడం వల్ల చన్నీటి స్నానాలు చేయలేకపోతున్నారు. కొన్ని హాస్టళ్లలో మాత్రమే సోలార్ హీటర్లు పనిచేస్తున్నాయి. అక్కడక్కడా కట్టెల పొయ్యి మీద వేడినీళ్లు కాచి ఇస్తున్నారు. ఇక మెజార్టీ హాస్టళ్లు, గురుకులాల్లో చన్నీటి స్నానాలతో ఇబ్బందులు తప్పడం లేదు.

గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో మృతి



విశ్వనాథ్(ఫైల్)

పెద్దశంకరంపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన రంగిరి విశ్వనాథ్(48) 10 రోజుల క్రితం మండల పరిధిలోని కమలాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేట పోలీసులు తెలిపారు.

ట్యాంకర్ టైర్ల చోరీ



చోరీకి గురైన వాటర్ ట్యాంకర్ టైర్లు

జిన్నారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిన్నారం పంచాయతీకి చెందిన నీటి సరఫరా చేసే ట్రాక్టర్ ట్రాలీ ట్యాంకర్ టైర్లను అపహరించారు. గ్రామ శివారులో రంగనాయక గుట్ట వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులకు నీటిని అందించేందుకు ట్యాంకర్‌ను శనివారం అక్కడే నిలిపి ఉంచారు. ఆదివారం ఉదయం వచ్చేసరికి ట్రాలీ రెండు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామానికి నీటిని సరఫరా చేసే ట్యాంకర్ టైర్ల చోరీ పట్ల స్థానికులు మండిపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ-సేవా కేంద్రంతో ఎంతో ఉపయోగం



నర్సాపూర్ కోర్టు వద్ద ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి

నర్సాపూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోర్టులో ఈ సేవా కేంద్రం ఏర్పాటు వల్ల కక్షి దారులకు సేవలు మరింత అందుబాటులో వచ్చి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్ కోర్టు వద్ద ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సేవా కేంద్రం ద్వారా కక్షిదారులు, న్యాయవాదులు కోర్టు వెలువర్చిన తీర్పుల ధ్రువీకరణ పత్రాలను, జమానత్‌లను త్వరగా తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏజీపీ సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సూపరింటెండెంట్ పద్మావతి, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

మంజీరా రిజర్వాయర్ వద్ద వనభోజనాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ సమీపంలోని మంజీరా రిజర్వాయర్ వద్ద కార్తీక వన భోజనాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ హాజరయ్యారు. కార్యక్రమంలో దినేష్ పాటిల్, శెట్టి శివకుమార్, శివ చరణ్, మధు, రాచప్ప, అనిల్ కుమార్, లత, అశ్విని, జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, మల్లికార్జున్ పాటిల్, ధనుంజయ, శివకుమార్ అడ్వకేట్, సంగమేశ్వర్ అడ్వకేట్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల కార్తీక వన భోజన మహోత్సవం



కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు

చందానగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీరంగూడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన మహోత్సవం ఆదివారం ఐలాపూర్ అయిమాతాజీ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతం, వాసవి మాత పూజ, మహాహారతి నిర్వహించారు. తీర్థప్రసాదాల అనంతరం వన భోజన మహోత్సవం నిర్వహించారు. చిన్నారులను ఉత్సాహపరిచేవిధంగా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ శ్యాంసుందర్‌గుప్తా, వైస్ ప్రెసిడెంట్ మాణిక్యం, జనరల్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు, నాగసూర్యప్రకాష్, మురళి, రమణ, సుధీర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి'

రేగోడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఎస్ఐ పోచయ్య పేర్కొన్నారు. రేగోడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయకమిటీ సభ్యుడు నరేష్ మాట్లాడుతూ.. సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టాలని సూచించారు. మాంత్రికులు, భూత వైద్యులు చేసే మాయాజాలానికి సంబంధించిన పలు అంశాలను ఉప్పులేటి నరేష్ సైన్స్ మ్యాజిక్ షో ద్వారా ప్రదర్శించి, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్వప్న, పోలీస్ సిబ్బంది, స్పెషల్ ఆఫీసర్ స్వయంప్రభ, స్వప్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు,

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వయో వృద్ధుల దినోత్సవం



వయోవృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

నర్సాపూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపూర్‌లో వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, స్త్రీ సేవా సంస్థ అధ్యక్షురాలు శోభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధ దంపతులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జైపాల్, ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

'మాలల మహా గర్జన విజయవంతం చేయాలి'

నిజాంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించతలపెట్టిన మాలల సింహగర్జనకు రాష్ట్రంలోని మాలలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. మాలల మహాపాదయాత్ర నిజాంపేటకు చేరుకున్న సందర్భంగా ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రంలో మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితిలో ఒప్పుకోబోమని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు



ఝరాసంగం: కేతకీ ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సంగారెడ్డిలోని బ్యాంకు కాలనీలో మహాపడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు



మెదక్ కోదండ రామాలయంలో శ్రీరమా సహిత సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ఝరాసంగం, (ఆంధ్రజ్యోతి) నవంబరు 24: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి భక్తులు తరలివచ్చారు.

- సంగారెడ్డి టౌన్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో గల బ్యాంకుకాలనీలో ఆదివారం అయ్యప్పస్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో వందలాది మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి, సదాశివపేట, పెద్దశంకరంపేట, నిజాంపేట తదితర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.
- పుల్‌కల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు ఆదివారం శబరిమలకు తరలివెళ్లారు. అంతకుముందు స్థానిక శ్రీ అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులను కట్టుకుని వాహనాల్లో తరలివెళ్లగా, వారికి గ్రామస్థులు, సన్నిహితులు సాగనంపారు.
- జహీరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొన్నారు.
- మెదక్ అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని స్థానిక శ్రీ కోదండ రామాలయం కల్యాణ మండపంలో భక్తులు సామూహికంగా శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. వ్రతాల్లో దంపతులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.
- శివ్వంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గూడూరు పురాతన ఆలయం శ్రీ గణాధిపతి సహిత పార్వతి సోమేశ్వరాలయంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న శిలా ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ధ్వజస్తంభం దాత ఇంద్రేశం వాస్తవ్యుడు పట్లోళ్ల బలరాం సహకారంతో మొదటి రోజు వేద పండితులు కొండ వెంకటేశ్వర శర్మ సమక్షంలో వేద పండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీప స్థాపన పంచ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రెండో రోజు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో కార్యక్రమం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.